క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దారుగా సురేష్

శావల్యాపురం: మండల తహసీల్దారు కె.సుజాత మంగళవారం నుంచి వ్యక్తిగత కారణాలపై నెల రోజుల పాటు సెలవుపై వెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వినుకొండ తహసీల్దారు సబ్‌వత్ సురేష్‌కు ఇన్‌చార్జ్ తహసీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బుధవారం మండల కేంద్రానికి రానున్నారు.

చిలకలూరిపేట ఎంఈవోగా శ్రీనివాసరావు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా చిలకలూరిపేట అదనపు మండల విద్యాశాఖ అధికారిగా అనంతవరం శ్రీనివాసరావును నియమిస్తూ గుంటూరు స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వర్‌రెడ్డి నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి–1గా విధులు నిర్వహిస్తున్న ఏ.శ్రీనివాస రావు ఇప్పటికే ముప్పాళ్ళ, గురజాల మండలాలకు అదనపు మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చిలకలూరిపేట మండలం కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



వినుకొండ: మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి నెలలో థీమ్ సోర్స్ సెగ్రిగేషన్ అవేర్నెస్ కాంపెయిన్ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు మూడు డబ్బాల వాడకం చెత్తను వేరు (తడిపొడి గృహ సంబంధిత ప్రమాదకర) చేయుట, సింగల్ యుజ్ ప్లాస్టిక్ వల్ల కలుగే నష్టాలు, వ్యక్తిత్వ వికాసం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్, స్కూల్ టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ దాడులు



నరసరావుపేట రూరల్: మండలంలోని కొండకావూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 219లో పెద్ద ఎత్తున అక్రమంగా మైనింగ్ జరుగుతుందన్న ఫిర్యాదుపై మంగళవారం దాడులు నిర్వహించి ఒక జేసీబీ, రెండు టిప్పర్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సూర్య శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆకస్మిక తనిఖీలలో పాల్గొన్నారన్నారు. తదుపరి చట్టపరమైన చర్యలకు జిల్లా మైనింగ్ అధికారులకు వాహనాలు అప్పగించామన్నారు.

గురుకుల పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

చిలకలూరిపేట: ప్రతిభ గల పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కె శరత్ చౌదరి చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో మండలంలోని రాజాపేటలో ఉన్న ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె.శ్రీనివాసరావు, రోట రీ క్లబ్ ఆఫ్ పండరీపురం ప్రెసిడెంట్ వారణాసి శరత్‌కుమార్ శాస్త్రి, కార్యదర్శి కొల్లా సుబ్బారావు, పోలిశెట్టి రాఘవయ్య, జెస్సీ బిర్గీ, సిమ్రాన్ మైనీ పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి

బొల్లాపల్లి: విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని మోడల్ స్కూల్ డెప్యూటీ డైరెక్టర్ ఎన్.వి.రమణ సాగర్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. గత ఏడాది ఇంటర్, టెన్త్ ఫలితాలు గురించి ఆరా తీశారు. బోధనలో అధ్యాపకులు సామర్థ్యాన్ని పెంపొందించుకునే విధంగా విద్యార్థులకు బోధన పద్ధతులు ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యే విధంగా పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో ఏ ఏ ఎం ఓ ఎం.శరత్ బాబు, అధ్యాపకులు బోధనేతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల పాఠశాలకు మహర్దశ

- పీఎంశ్రీ నిధులతో అభివృద్ధి పనులు
- పాఠశాల్లో మౌలిక వసతులు
- క్రీడా మైదానాలు అభివృద్ధి



నూజెండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల



పాఠశాలలో వాకింగ్ ట్రాక్ పనులు చేస్తున్న దృశ్యం

నూజెండ్ల: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యబోధన మౌలిక వసతుల ఏర్పాటు కోసం కేంద్ర పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రవేశపెట్టింది. నూజెండ్ల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ పథకానికి ఎంపికైంది. ఇందులో భాగంగా మొదట దశలో ఆట స్థలాలు అభివృద్ధి మెరుగైన వసతుల కల్పనకు రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలలో ఆట స్థలంలో వాకింగ్ ట్రాక్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల మౌలిక వసతుల కల్పనకు రూ.13 లక్షల 25 వేలు మంజూరు కాగా వాటిలో తాగునీటి కోసం రూ.6 లక్షల 25 వేలు ఆర్వోప్లాంటు పాఠశాలకు మంజూరు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా షెడ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే ఆధునిక ఫిజిక్స్ లైబ్రరీ సోలార్ విద్యుద్ధీకరణ తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ నిధులు రూ.50 వేలతో త్వరలో పాఠశాలలో బోధనేతర అంశాలైన ఎన్‌సీసీ స్కౌట్స్ ఏర్పాటు చేయనున్నారు. మెరుగైన విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ ప్లేట్లను అమర్చనున్నారు.

పాఠశాల దివ్యాంగ విద్యార్థుల సౌకర్యం కోసం తరగతి గదులకు వెళ్లడానికి రైలింగ్ నిర్మాణాలు ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా ఏడాది నుంచి చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే దివ్యాంగ విద్యార్థులకు రవాణా భత్యం కింద సంవత్సరానికి రూ.3 వేలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేయనుంది.

వసతులు మెరుగుపడ్డాయి



నూజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉంది. పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుదలవడం వల్ల విద్యార్థులు ఉన్నతంగా విద్యాభ్యాసం చేయగలుగుతారు. క్రీడా మైదానాలు అభివృద్ధి చేయటం విద్యార్థులకు శారీరకంగా మానసికంగా చాలా మేలు జరుగుతోంది.

–ఎన్.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు

పీఎంశ్రీ నిధులతో ఎంతో ఉపయుక్తం



గతంలో చిన్నపాటి వర్షానికి క్రీడామైదానం చిత్తడిగా మారేది. పీఎంశ్రీ నిధులతో వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా మైదానాలకు మట్టి తోలకం వలన సౌకర్యంగా మారాయి. క్రీడా మైదానాలు అభివృద్ధి మంచి శుభపరినామం. విద్యార్థులు క్రీడాల్లో రాణించటానికి మైదానాలు ఎంతోగానో దోహదపడతాయి.

–వెంకటరత్నం, వ్యాయామ ఉపాధ్యాయులు

వేర్వేరు ప్రాంతాల్లో ఆధార్ క్యాంపులు



యడ్లపాడులో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వి.హేమలతా దేవి

నూజెండ్ల: మండలంలో నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.ఉమాదేవి మంగళవారం తెలిపారు. 19న తెల్లపాడు, తలార్లపల్లె, 20న కంభంపాడు,ఐనవోలు, 21న పమిడిపాడు, మృత్యుంజయపురం, 24న ముతరాసిపాలెం, ముప్పరాజువారిపాలెం, 25న ముక్కెళ్ళపాడు, రవ్వారం, 27న పువ్వాడ, నూజెండ్ల 28న వి.అప్పాపురం, నూజెండ్ల గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్యాంపులు జరుగుతాయన్నారు.

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో వి.హేమలతాదేవి ఆధ్వర్యంలో స్థానిక బొడ్రాయి సెంటర్ సమీపంలోని అంగన్‌వాడీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 18 నుంచి 21 తేదీ వరకు శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు కొత్త ఆధార్ నమోదు ఉచితంగానూ, గతంలో ఆధార్ కార్డులు ఉన్న వారికి అప్‌డేట్, కార్డులోని వివరాలు, అడ్రస్ మార్పులు, చేర్పులకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు వసూలు చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు విధిగా ఆధార్ కేంద్రం ద్వారా అందించే సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయితే తొలిరోజు మధ్యాహ్నం వరకు సైట్ అనుసంధానం కాక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో యడ్లపాడు పంచాయతీ కార్యదర్శి శశికళ, గ్రామ సచివాలయం సిబ్బంది ప్రసన్న, స్వాతి ఉన్నారు.

వరికపూడిశెలకు నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎం నాయకులు

వినుకొండ: బొల్లాపల్లి మండల ప్రజల దాహార్తి తీర్చేందుకు ముఖ్యమైన వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి రాబోయే బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రాజెక్టు నిర్మాణం వెంటనే చేపడతామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తదితరులు ప్రకటించారని, అంతేకాకుండా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కూడా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి పాదయాత్రలో ఒక రాయి కూడా ప్రతిష్ఠించడం జరిగిందని గుర్తు చేశారు. నెల 24వ తేదీ నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వరికపూడిశెల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ఆరంభం



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో బ్రహ్మేశ్వరరావు

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో జ్ఞాన జ్యోతి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలల్లో ఇప్పటి వరకు ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు మాత్రమే విద్యాబోధన జరిగేదన్నారు.. జాతీయ విద్యా ప్రణాళిక ప్రకారం ఇక నుంచి 03 నుంచి 08 సంవత్సరాల లోపు చిన్నారులకు విద్య బోధన చేయాలన్నారు. ఇందుకు గాను కావాల్సిన నైపుణ్యాలను ఆరు రోజుల శిక్షణా తరగతుల్లో నేర్పించటం జరుగుతుందన్నారు. మొదటి రోజు విద్యా లక్ష్యాలు, బోధన స్థాయి, బోధన ఉప కరణాలు తయారీ వాటి గురించి వివరించారు. 77 మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ముదివర్తి అనురాధ, రీసోర్స్ పర్సన్లు బిళ్లా రాజారమేష్, యం. శ్రీనివాసరావు, బి. రవి, ప్రవీన్, ఐసీడీఎస్ కుప్పం శ్రీలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం నుండి అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ప్రారంభమైంది. మండలంలో అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజులపాటు ఈ కార్యక్రమం ద్వారా జరిగే శిక్షణా తరగతులను మొదటి రోజు ఎంఈవో డి.బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు వారి వృత్తిలో రాణించేందుకు ప్రభుత్వం జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తుందన్నారు. పి.పి.టి లు, డి.ఆర్.పిల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణా తరగతులలో నేర్చుకొన్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణా తరగతులకు డి.ఆర్.పి.లుగా టి.వేంకటేశ్వర్లు, హనుమంతరావు, వై.రామయ్య, మల్లిఖార్జునరావులు వ్యవహరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు డి.దేవిభాయి, శశిదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శాశ్వత లైన్‌మెన్ ఏర్పాటు చేయండి సార్



శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో శాశ్వత అసిస్టెంట్ లైన్‌మెన్ లేకపోవటంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులు లిఖిత పూర్వకంగా మండల విద్యుత్ శాఖాధికారి జవ్వాజ్ నటరాజ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం కావటం, వ్యవసాయ విద్యుత్ మోటార్లు 360 ఉన్నాయని ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు గురౌతున్నాయన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఏఈ దృష్టికి తెచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫీజు పోయిన పట్టించుకునే నాథుడు లేడని ఏఈకు తెలిపారు. సత్వరమే విద్యుత్ అధికారులు స్పందించి శాశ్వత లైన్‌మెను ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కోట హరిబాబు, గోపాలం శివప్రసాదు, యరమాసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పశుగణన ఎంతో మేలు

పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు



పశు గణనను పరిశీలిస్తున్న అధికారులు

రొంపిచర్ల: మండలంలో అన్నవరం, రామిరెడ్డిపాలెం, బుచ్చిబాపన్నపాలెం, ఆరేపల్లి, గోగులపాడు, కొనకంచి వారిపాలెం గ్రామాలలో మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు పర్యటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కాంతారావు ఆయా గ్రామాలలో పశు గణనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు గణన పరిశీలన ద్వారా గ్రామాలలో ఉన్న ఆవులు, గేదెలు, పెంపుడు జంతువుల సంఖ్య, వీధి ఆవుల సంఖ్య గురించి విచారణ జరిపి, వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు సమర్ధవంతంగా అమలు చేయడంలో, రైతులకు చెందిన పశువులకు మెరుగైన వెటర్నరీ సేవలు అందించటంలో కీలకపాత్ర వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ సాయి మహేష్ రెడ్డి, సిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

కొండవీడు కోట అభివృద్ధి చేస్తా

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- షూటింగ్ స్పాట్‌కు కొండవీడు బెస్ట్: హీరో శివాజీ
- కొండవీడును సందర్శించిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి, హీరో శివాజీ



కొండపై లక్ష్మీనర్సింహ ఆలయంలో పూజలు చేసిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు: కొండవీడు కోట అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి కొండవీడును సందర్శించారు. అక్కడే షూటింగ్‌లో పాల్గొన్న శివాజీతో కలిసి కొండపై పునర్ నిర్మించిన శ్రీలక్ష్మీ నర్సింహస్వామి పురాతన ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. కొండపై ఉన్న చారిత్రక కట్టడాలను, చెరువులు, మసీదు, పార్కుల్ని, వనాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గిరి దుర్గం ప్రాధాన్యతను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కొండవీడు కృషి చేస్తామన్నారు. కొండవీడుపై అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగే నగరవనంలో మెరుగైన సదుపాయాల్ని కల్పించి సందర్శకులకు ఆకర్షించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. చారిత్రక సినిమా చిత్రీకరణకు కొండవీడుకోట ఎంతో అనువైనదన్నారు. రాష్ట్రంలో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందాలనే సంకల్పంతో తన చిత్రాన్ని ఇక్కడ షూటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ కొండవీడు అభివృద్ధిని కాంక్షిస్తూ నియోజక వర్గంలో షూటింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సినీ యూనిట్, పార్టీ నాయకులు, సమీప గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

కొండవీడు కొండల్లో సినిమా షూటింగ్



షూటింగ్ స్పాట్‌లో హీరో శివాజీని సత్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

యడ్లపాడు: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడు కోటపై మంగళవారం సినిమా షూటింగ్ జరిగింది. టాలివుడ్ హీరో శివాజీ నటిస్తూ నిర్మిస్తున్న ప్రొడక్షన్–1 కుటుంబ కథా చిత్రం సన్నివేశాలను కొండవీడు కొండలపై పలు చోట్లు చిత్రీకరించారు. అన్నమయ్య జిల్లా కొత్తకోట మండల అరసవెల్లి పర్యాటక కేంద్రాన్ని తలపించే విధంగా ఇక్కడ షూటింగ్‌ను నిర్వహించారు. ఇదే సమయంలో కొండవీడుకు విచ్చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును చిత్ర యూనిట్ సాదరంగా స్వాగతించింది. షూటింగ్ విశేషాలను ముచ్చటించిన అనంతరం హీరో శివాజీని మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శాలువాతో సత్కరించి అభినందించారు. అంతకు ముందు నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలోనూ, తూబాడు అడ్డరోడ్డు సెంటర్లోనూ షూటింగ్ నిర్వహించినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. కార్యక్రమంలో చిత్ర దర్శకులు సందీప్, కెమెరామెన్ రిత్విక్‌రెడ్డి చిత్రబృందం ఉన్నారు.

వరిలో జింకు లోపంపై దృష్టిసారించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో నరేంద్రబాబు

నరసరావుపేట రూరల్: వరిలో జింకు లోపం నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని రావిపాడులో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు పాల్గొని పంట పొలాలను పరిశీలించారు. వరిలో జింకు లోపం గుర్తించి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. వరి ఆకుల్లో పై నుంచి మూడు నుంచి నాలుగు ఆకుల మధ్య ఈనె పాలిపోయి ఉండటం, నాటు వేసిన రెండు లేదా ఆరు వారల్లో ముదురాకు చివర్లలో ఈనెకు ఇరుపక్కల తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు కనబడటం జింకు లోపం అన్నారు. దీని నివారణకు రెండు గ్రాముల జింకు సల్ఫేట్‌ను లీటరు నీటితో కలిపి ఐదు నుంచి ఏడు రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఉమారాణి, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి టాటా మోటార్స్ టియాగో కారు



టియాగో కారు ప్రారంభిస్తున్న జాస్పర్ షోరూమ్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ

చిలకలూరిపేట: వినియోగదారులకు అన్ని రకాల సౌకర్యాలతో టాటా మోటార్స్ సంస్థ టియాగో, టిగోర్, టియాగో ఈవీ కార్లను అందుబాటులోకి తెచ్చిందని జాస్పర్ షోరూమ్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ చెప్పారు. పట్టణంలోని జాస్పర్ షోరూమ్‌లో టియాగో మోడల్ నూతన కారును మంగళవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టియాగో కారులో 10.25 ఇంచుల టచ్ స్క్రీన్, ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, ఫ్రంట్ బంపర్ డిజైన్ ఇవ్వడం జరిగిందన్నారు. 360 డిగ్రీ కెమెరా ఫీచర్ కూడా ఈ నూతన వాహనంలో ఇవ్వడం జరిగిందన్నారు. ఈ వాహనం ప్రారంభ ధర రూ. 4.99 లక్షలుగా నిర్ణయించారని, అలాగే ప్రారంభించనున్న టిగోర్ కారు ప్రారంభ ధర రూ. 5.99 లక్షలుగా, టిగోర్ ఈవీ కారు ప్రారంభ ధర రూ. 7.99 లక్షలుగా నిర్ణయించటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సురేష్, కెనరా బ్యాంక్ మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

నరసరావుపేట: టాటా మోటార్స్ వారి నూతన టియాగో, టిగోర్, టియాగో ఈవీ కార్లను స్థానిక జాస్పర్ టాటా కార్ షోరూంలో ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అమర్ లాంఛింగ్ చేశారు. షోరూమ్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ టియాగో వెహికల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 10.25 ఇంచెస్ టచ్‌స్క్రీన్, ఎల్ఈడి హెడ్ ల్యాంప్, ఫ్రంట్ బంపర్ డిజైన్ స్టైల్‌గా ఇవ్వటం జరిగిందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జిల్లా టెన్నీస్‌బాల్ క్రికెట్ జట్టులో కే-రిడ్జి విద్యార్థులు



జిల్లా టెన్నీస్‌బాల్ క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ బర్నబాస్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా సీనియర్ టెన్నీస్ బాల్ క్రికెట్ జట్టుకు కే-రిడ్జి స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్ మంగళవారం తెలిపారు. ఈనెల 17న రాజుపాలెం ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీలో తమ విద్యార్థులు సి.హెచ్.విన్స్, బి.గౌతమ్‌రెడ్డి, జి.గౌతమ్ ప్రదీప్‌రెడ్డి ఎంపికై నట్టు వివరించారు. చిత్తూరుజిల్లా తుమ్మలకుంటలో ఈనెల 21వతేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ టెన్నీస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు పల్నాడుజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అలాగే అద్దంకిలో నిర్వహించిన కరాటే పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాలలో పాల్గొని బహుమతులు సాధించారని తెలిపారు. విద్యార్థులకు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.కిషోర్‌బాబు, మహిత, కరాటే కోచ్ ఓ.శివకృష్ణ అభినందించారు.

చీఫ్‌విప్ జీవీ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

వినుకొండ: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కే.ఎస్.లక్ష్మణరావును ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేసిన విమర్శలు, అణిచివేత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ సోమవారం పుతుంబాక వెంకటపతి భవన్‌లో యూటీఎఫ్, ప్రజాసంఘాల సంయుక్తంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా లక్ష్మణరావు చేసిన పోరాటాలను వివరించారు. 14 ఏళ్ల ఎమ్మెల్సీ జీవితంలో కేఎస్ లక్ష్మణరావు ఎవరిని విమర్శించ లేదని స్పష్టం చేశారు. కరోనా సమయంలో ప్రైవేటు ఉపాధ్యాయులను ఆదుకునేందుకు ఆయన చేసిన కృషిని వివరించారు. రవిబాబు, అజయ్ కుమార్, డీవీ లింగయ్య, జిలాని, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్యం

నరసరావుపేట: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ రవిందబాబు ప్రత్యేక పారిశుద్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చెత్తను తొలగించి డ్రైనేజీ కాలువలను శుభ్రం చేశారు.

ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య తప్పని సరి

రొంపిచర్ల: ప్రతి రైతు విధిగా విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని ఏడీఏ పి. మస్తానమ్మ అన్నారు. మండలంలోని పరగటిచర్ల, మాచవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులందరూ 11 అంకెల రైతు గుర్తింపు కోసం ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో వివరాలను పొందుపరుచుకోవాలన్నారు. ప్రతి రైతు ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్స్ కాపీలు, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబర్‌ను తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి అందజేయాలన్నారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ దాళ్వావరిలో రైతాంగం అవలంబించాల్సిన మెళుకువలను వివరించారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రస్తుత తరుణంలో యూరియా, పొటాష్ ఎరువులనే వరికి వినియోగించాలన్నారు. అలాగే మిరప పంటలోని తామర పురుగు నివారణకు రైతులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివలలిత, ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి దాహార్తి తీర్చండి

నరసరావుపేట: నీటి ఎద్దడితో అల్లాడుతున్న బొల్లాపల్లి ప్రజల దాహార్తిని వెంటనే తీర్చాలని టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు వి.కోటానాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో బొల్లాపల్లి ప్రజలతో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే ట్యాంకర్ల ద్వారా ప్రజలు దాహార్తిని తీర్చాలని కోరామన్నారు. దీనిపై సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు.